క్లుప్తంగా

గునపాటిపాళెంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

చిట్టమూరు :మండలంలోని గునపాటిపాళెం పీహెచ్‌సీలో గురువారం తిరుపతి స్విమ్స్ వైద్య బృందం ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల శిబిరం నిర్వహించింది. స్విమ్స్ వైద్యులు చైతన్య భాను, పద్మావతి పింక్ బస్సులో పురుషులకు నోటి క్యాన్సర్, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖ ద్వార నిర్ధారణకు పాప్ స్మియర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. తొలుత క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ వైద్యులు రామాంజనేయులు, దుర్గా చైతన్య, పంచాయతీ సర్పంచ్ పోలయ్య, స్విమ్స్ అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నివాళి..పరామర్శ


నివాళులర్పిస్తున్న మేరిగ మురళీధర్

కోట: కొత్తపాళెంకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నేదురుమల్లి హరిప్రసాద్‌రెడ్డిని గురువారం ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పరామర్శించారు. హరిప్రసాద్‌రెడ్డి సతీమణి ప్రసూన(46) ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో వారి నివాసానికి వెళ్లి ఆమె చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్సీ వెంట పార్టీ మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్ రెడ్డి, రాజారాంరెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి ఉన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం చేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

చిల్లకూరు: మండలంలో చేడిమాలలోని ఓ పేద కుటుంబానికి గురువారం రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు రూ.15 వేల ఆర్థిక సాయం చేసింది. గూడూరు మండలం విందూరులోని గిరిజన కాలనీకి చెందిన ఏకుల శివ అనే యువకుడు చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయాడు. కూలీపనులకు వెళ్తూ ముగ్గురు చెల్లెళ్లను పోషిస్తున్నాడు. వీరు నివసించేందుకు కూడా కనీసం గూడు కూడా లేకపోవడం, చెల్లెలి ఆరోగ్యం బాగా లేకపోవడంతో వైద్యం చేయించుకునేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నట్టు తెలుసుకున్న ట్రస్ట్ అధినేత రాజనేని శ్రీనివాసులు స్పందించారు. ట్రస్ట్ ప్రతినిధులు బాబు, ప్రజేంద్రరెడ్డి ద్వారా ఆ కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



నాయుడుపేటటౌన్: పట్టణంలోని మేరి వృద్ధాశ్రమంలో వృద్ధుల గురువారం పట్టణానికి చెందిన యూ.నాగేశ్వరరావు నాయుడు, లక్ష్మీదేవి దంపతులు దుప్పట్లు పంపిణీ చేశారు. లక్ష్మీదేవి తండ్రి నారాయణరావు స్మారకార్థం ఈ వితరణ చేశారని ఆశ్రమ నిర్వాహకులు సునీతా బెన్ని తెలిపారు.

ప్రత్యేక పూజలు



గూడూరు రూరల్: చెన్నూరులోని కోదండరామ స్వామి ఆలయంలో దేవాంగ కుల దైవం రామలింగ చౌడేశ్వరి దేవి జన్మదినం సందర్భంగా గురువారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజార్చనలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కటికాల శేషగిరి, జగన్, చలమయ్య, చంద్ర పాల్గొన్నారు.

మోటార్ సైక్లిస్టులకు గాయాలు

చిల్లకూరు: విద్యార్థులతో వెళ్తున్న ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీ బస్సు కోట క్రాస్ రోడ్డు వద్ద గూడూరు వైపు నుంచి వస్తున్న మోటార్ సైక్లిస్టులను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ ప్రయాణిస్తున్న ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. వివరాలు..మనుబోలు మండలం మడమనూరుకు చెందిన ఓ వ్యక్తితో పాటు కోట మండలం వజ్జావారిపాళెంకు చెందిన మరో వ్యక్తి బైక్‌పై కోట వైపు వెళ్తుండగా కాలేజీ బస్సు వారిని ఢీకొంది. అయితే దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

చికెన్ ధరలు		25.7.2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	134
లేయర్ లైవ్	:	112
బ్రాయిలర్ చికెన్	:	240
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:	264
లేయర్ చికెన్	:	190

హామీల డాబు..మోసాల బాబు


వాకాడు: హాజరైన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు


వాకాడు: క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మేరిగ మురళీధర్, నేతలు

- కూటమిది నయవంచన పాలన
- ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ విమర్శ

వాకాడు/దక్కిలి/ బాలయపల్లె(సైదాపురం): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం నయవంచన పాలన చేస్తోందని ఉమ్మడి నెల్లూరు జిల్లా ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ధ్వజమెత్తారు. వాకాడు, దక్కిలి, బాలాయపల్లె మండలం జయంపులో గురువారం 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమాలు నిర్వహించారు. వాకాడులో మురళీధర్, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత కొడవలూరు దామోదర్‌రెడ్డి, దక్కిలిలో మండల కన్వీనర్ చింతల శ్రీనివాసులురెడ్డి , జయంపులో బాలాయపల్లె మండల కన్వీనర్ వెందోటి కార్తీకరెడ్డి తదితరులు మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి నయవంచన పాలనను ఇంటింటికీ వెళ్లి వివరిస్తామన్నారు. చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలు పూర్తి స్థాయిలో నెరవేర్చకపోవడంపై అన్నివర్గాల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంటు అమలు కాక వేలాది మంది విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని, కొందరు పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లల చదువు కోసం పుస్తెలు తాకట్టు పెట్టి ఫీజులు కడుతున్నారన్నారు. ఇక, రైతాంగం సంక్షేమం ఊసే లేదని, గిట్టుబాటు ధరల్లేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 'ఆడబిడ్డ నిధి' పథకం అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మాలని సాక్షాత్తు మంత్రి అచ్చెన్నాయుడు చెప్పడం చూస్తే ఇక మహిళల నోట్లో మట్టి కొట్టినట్లేనని తేటతెల్లమైందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎక్కడ చూసినా ఇసుక మాఫియా, గ్రావెల్, మట్టి మాఫియా, ఆరాచకాలు, దౌర్జన్యాలు, హత్యాకాండలు పెచ్చరిల్లాయని, రాష్ట్రంలో ఒక భయానక వాతావరణం కల్పించిందని విమర్శించారు. ప్రజలు కూటమి ప్రభుత్వంతో బేరీజు వేసుకుంటే జగనన్నే పార్టీలకతీతంగా అన్ని వర్గాల ప్రజలకు ఎన్నో రెట్లు మేలు చేశారని బాహాటంగానే చెబుతున్నారన్నారు. గూడూరు ఎమ్మెల్యే అభివృద్ధిని చేయడం మరచి అక్రమార్జనకే వెంపర్లాడుతున్నారన్నారు. ఏ ఒక్క కార్య కర్త, నాయకుడికి కూటమి నష్టం కలిగించినా రాబోవు కాలంలో దానికి రెండింతలు మూల్యం చెల్లించకతప్పదని హెచ్చరించారు. అనంతరం క్యూ ఆర్ కోడ్ బోర్డులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వాకాడు జెడ్పీటీసీ సభ్యుడు రౌతు రామకృష్ణ, వైస్ ఎంపీపీ వెంకటరమణయ్య, సర్పంచ్ రత్నమ్మ, మాజీ ఎంపీపీ రమణమ్మ, నాయకులు హిమకుమార్‌రెడ్డి, పెంచల రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సుధాకర్‌నాయుడు, వెంకటరత్నం, జనార్ధన్ రెడ్డి, మధురెడ్డి, సురేంద్రరెడ్డి, విజయ్‌రెడ్డి, నల్లపురెడ్డి, రవి, జితేంద్ర, వెంకటయ్య, రవిశేఖర్‌రెడ్డి, సోషల్ మీడియా నాయకులు లోకేష్, లోకకళ్యాణ్‌రెడ్డి, నాయకులు పీ.జగన్‌మోహన్‌రెడ్డి, వేణు నాయుడు, మధురెడ్డి, మురళీరెడ్డి, పీ.నారాయణరెడ్డి, బాలకృష్ణ, ఎం.మురళీ నాయుడు, బలరామిరెడ్డి, కే.ప్రభాకర్‌బాబు నాయుడు, డీపీ యాదవ్, చెంచయ్య, రమేష్‌రెడ్డి, శ్రీహరిరెడ్డి, జీ అరుణాచలం, బాలయపల్లె మండల నాయకులు వెంకటరమణారెడ్డి, వెంకటేశ్వర్లునాయుడు, గోపాల్‌యాదవ్, మస్తాన్, కృష్ణయ్య, రాజారెడ్డి, శ్రీనివాసులు, సురేష్, సిద్ధయ్య, ప్రసాద్‌రెడ్డి, రామ్మూర్తి, మహేంద్ర, భానురెడ్డి, గిరినాయుడు, శ్రీరాములు,కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


దక్కిలి: బాబు ష్యూరిటీ -మోసం గ్యారంటీ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు


సైదాపురం: బాలాయపల్లె మండలం జయంపులో హాజరైన ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు

నిమ్మ చెట్లు తొలగించి గిరిజనుల భూమి ఆక్రమణ

- నిందితులపై చర్యలు తీసుకోవాలని కలువాయిలో బాధితుల ఆందోళన


ఆందోళన చేస్తున్న గిరిజనులు, నేతలు

కలువాయి(సైదాపురం): గిరిజనుల భూముల్లో నిమ్మ చెట్లను తీయించిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కల్లూరు పెంచలయ్య డిమాండ్ చేశారు. నిమ్మ చెట్ల తొలగింపును నిరసిస్తూ గురువారం కలువాయి తహసీల్దార్ కార్యాలయం వద్ద గిరిజనులు ఆందోళన చేశారు. దీనికి నేతృత్వం వహించి పెంచలయ్య మాట్లాడారు. మండలంలోని బాలాజీరావుపేటకు చెందిన ఇండ్ల పెద వెంకయ్యతో పాటు వారి కుటుంబ సభ్యులకు ఇచ్చిన డి-పట్టా భూమిలో సాగు చేసుకుంటున్న నిమ్మచెట్లను అదే గ్రామానికి చెందిన సిద్ధి వెంకటేశ్వర్లు కొందరితో తొలగించి పక్కనే ఉన్న బావిలో పడేశారని, బోరును సైతం ధ్వంసం చేసి భూమిని ఆక్రమించారని నిరసన వ్యక్తం చేశారు. దీనిపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేస్తామన్నారు. బాధిత గిరిజనులకు న్యాయం చేయాలని, నిందితులపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ శ్యామ్‌సుందర్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో మహిళాధ్యక్షురాలు చెంబేటి ఉష, నేతలు మల్లి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గుర్రం జాషువా రచనలతో సమాజ చైతన్యం


చిల్లకూరు: మాట్లాడుతున్న విశ్రాంత టీచర్ ఏలియా


గూడూరు రూరల్: సీపీఎం కార్యాలయంలో..

చిల్లకూరు/గూడూరురూరల్: ఆధునిక కవి గుర్రం జాషువా తన రచనలతో సమాజంలో చైతన్యం రగిలించారని పలువురు కీర్తించారు. చిల్లకూరు మండలం పారిచెర్లవారిపాళెం జెడ్పీ హైస్కూల్లో గురువారం గుర్రం జాషువా 55వ వర్ధంతి నిర్వహించారు. తెలుగు, విశ్రాంత ఉపాధ్యాయులు ఎస్ ఏలియా మాట్లాడారు. జాషువా 70 ఖండ కావ్యాలను రచించారని, వీటిలో గబ్బిలం, క్రీస్తు చరిత్ర, బాపూజీ, గిజిగాడు, శ్మశాన వాటిక, శిశువు.. మొదలైనవి మంచి ప్రాచుర్యం పొందాయన్నారు. అనంతరం జాషువా రచించిన పలు పద్యాలను విద్యార్థులు పద్య పఠనం చేశారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. హెచ్‌ఎం అనసూయ, భారతీయ విక్షణా మండలి సభ్యులు ప్రజేంద్రరెడ్డి, టీచర్లు నాగభూషణమ్మ, కామేశ్వరి, మధుసూదన్‌రావు, లీల, విద్యుల్లత, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు. అలాగే గూడూరులోని సీపీఎం కార్యాలయంలో జాషువా వర్ధంతిని కేవీపీఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి అడపాల ప్రసాద్, సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్ నిర్వహించారు. కేవీపీఎస్ నాయకులు ఎంబేటి చంద్రయ్య, గుర్రం రమణయ్య, గంటా వెంకటేశ్వర్లు, చంద్రయ్య, చంద్రమోహన్, బాలరాజు, ధనమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పితామహుడికి ఘన నివాళి


నివాళులర్పిస్తున్న అంజయ్య

రాపూరు: గ్రంథాలయ పితామహుడు పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య జయంతి పురస్కరించుకుని స్థానిక గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. గ్రంథాలయాధికారి అంజయ్య మాట్లాడుతూ, గ్రంథాలయాల అభివృద్ధికి వెంకటరమణయ్య ఎనలేని కృషి చేశారని ఆయన సేవలను ప్రస్తుతించారు. ప్రస్తుతం గ్రంథాలయం శిథిలావస్థకు చేరుకుందని, దాతలు ముందుకు చ్చి నూతన భవన నిర్మాణానికి కృషి చేయాలని కోరారు,

పాఠశాల విలీన సమస్యలపై అధికారుల విచారణ


వినతి పత్రం ఇస్తున్న పాళెంకోట గ్రామస్తులు

వెంకటగిరి రూరల్: మండలంలో పాళెంకోటలోని విద్యార్థులను మొక్కలపాడు పాఠశాలలో విలీనం చేయడంపై ఇటీవల తల్లిదండ్రులు ఆందోళన చేసిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు ఎంపీడీఓ గుణశేఖర్‌రెడ్డి, ఎంఈఓ బాబయ్య గురువారం పాళెంకోటకు వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. తమ గ్రామం నుంచి మొక్కలపాడు స్కూలుకు చిన్నారులు వెళ్లాలంటే వన్యప్రాణుల బెడద ఉందని, అలాగే వర్షం వస్తే గొడ్డేరు వాగు పొంగి ప్రవహించి రాకపోకలు స్తంభిస్తాయని సమస్యలు తెలియజేశారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామని అధికారులు చెప్పారు. తెలియజేశారు. అనంతరం ఉపాధి కూలీలకు కూలి సకాలంలో చెల్లించాలని రైతు కూలీ సంఘం నేతల ఆధ్వర్యంలో కూలీలు ఎంపీడీఓకు వినతిపత్రం ఇచ్చారు.

4 నుంచి బీటెక్ ఫస్టియర్ తరగతులు


మాట్లాడుతున్న ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో ఆగష్టు 4 నుంచి బీటెక్ ఫస్టియర్ విద్యార్థులకు తరగతులు ప్రారంభమవుతాయని కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి గురువారం తెలిపారు. కళాశాలలో అయన మాట్లాడుతూ, కంప్యూటర్ సైన్స్‌లో సీట్లు పెంచడంతో విద్యార్థులకు1,500 కంప్యూటర్లతో నూతనంగా సీఎస్‌సీ బ్లాక్ నిర్మించినట్లు చెప్పారు. అలాగే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోసం 300 కంప్యూటర్లతో నాలుగు ల్యాబ్‌లను ఎస్టాబ్లిష్ చేసినట్లు తెలిపారు. కళాశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన, ఏఐ, ఆటోమొబైల్, రోబోటిక్ రంగాల్లో అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీతో శిక్షణ ఇవ్వడంతో పాటు ప్లేస్‌మెంట్ ట్రైనింగ్ కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అన్నీ విభాగాల హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

చిట్టమూరు: వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో గ్రామ పంచాయతీలలో కార్యదర్శులు పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ మనోహర్ గౌడ్ ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు.పీ-4 భాగస్వామ్యంపై కార్యదర్శులకు దిశా నిర్దేశం చేశారు. గ్రామాల్లో అతి పేద కుటుంబాలను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో చిట్టమూరు పీహెచ్‌ఈ వైద్యురాలు పద్మావతి, ఈఓపీఆర్డీ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

డీలర్లతో తహసీల్దార్ సమీక్ష


డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్

వెంకటగిరి రూరల్: రేషన్ సరుకుల పంపిణీ పారదర్శకంగా చేయాలని తహసీల్దార్ నరసింహారావు ఆదేశించారు. గురువారం తన కార్యాలయంలో ఆయన రేషన్ డీలర్లతో సమీక్షించారు. సరుకుల పంపిణీ, తూనికల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. 65 ఏళ్లు పైబడిన లబ్ధిదారులకు 5వ తేదీ లోగా ఇళ్లకే వెళ్లి సరుకులు ఇవ్వాలన్నారు.

మేరిగను విమర్శిస్తే సహించం

కోట: ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌ను టార్గెట్ చేస్తూ టీడీపీ నాయకులు కువిమర్శలు చేస్తే సహించలేదిలేదని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు హెచ్చరించారు. గురువారం విద్యానగర్‌లోని నేదురుమల్లి కళాభవన్‌లో పార్టీ మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాదర్తి రాధాక్రిష్ణారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సురేంద్ర విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చక పోవడాన్ని 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమంలో ప్రతిపక్షంగా ప్రశ్నించామన్నారు. దీనిని సహించలేని టీడీపీ నాయకులు మేరిగ మురళీధర్‌పై వ్యక్తిగత విమర్శలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు

పెళ్లకూరు: మండలంలో పునబాక రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 508లోని రెండు ఎకరాలు భూమిలో గురువారం స్థానిక రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. పేదలకు మంజూరు చేసిన భూమిని సాగు పనులకు మాత్రమే ఉపయోగించాలని, వ్యవసాయేతర పనులు చేయరాదని ఆ బోర్డులో హెచ్చరించారు. తహసీల్దార్ హరికృష్ణ ఆదేశాల మేరకు ఈ బోర్డును ఏర్పాటు చేసినట్లు వీఆర్వో సుధాకర్ తెలిపారు.

ఆదాయం పెంపు మార్గాలు అన్వేషించాలి

– డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు

గూడూరు రూరల్: పేదరిక నిర్మూలనే కాకుండా ఆదాయం పెరుగుదలకు మార్గాలను కూడా అన్వేషించాలని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు అన్నారు. గురువారం గూడూరులోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జేఎల్‌ఎంబీసీ సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ, యాన్యువల్ క్రెడిట్ లైవ్‌లీ హుడ్ ప్లాన్(ఏసీఎల్‌పీ) ద్వారా రుణాల మంజూరుకు సంబంధించి బ్యాంకు లింకేజీలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఉపాధి కల్పనతో పాటు యూనిట్లు నెలకొల్పేవారికి ప్రోత్సాహకాలు ఉంటాయని, మహిళా ఔత్సాహికులను ప్రోత్సాహించాలన్నారు. రుణాల మంజూరుకు స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులందరూ ఆన్‌లైన్‌లో బయోమెట్రిక్ వేయాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో ఎల్‌డీఎం రవికుమార్, ఏపీజీబీ ఆర్‌ఎం. మోహన్‌రెడ్డి, హ్యాండ్లూమ్ ఏడీ రమేష్, డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ ప్రభావతి, గూడూరు ఇన్‌చార్జి ఎంపీడీఓ మోహన్, బ్యాంకు అధికారులు, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

చిన్న తరహా సాగునీటి పథకాలను గుర్తించండి

చిల్లకూరు: మండలంలో చిన్న తరహా సాగునీటి పథకాలను గుర్తించి నివేదికలను ఇవ్వాలని డిప్యూటీ తహసీల్దార్ జ్యోతి ఆదేశించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె ఏఎస్ఓ మధుసూదన్‌తో కలసి వీఆర్‌ఓలతో సమీక్షించారు. ప్రభుత్వం చిన్న, మధ్య తరహా సాగునీటి పథకాలను సర్వే చేసేందుకు పూనుకుంటోందన్నారు. దీనికి సంబంధించి ఆయా రెవెన్యూ గ్రామాలలో చిన్న, సన్నకారు రైతులు సాగు చేసే పంటల రకాలు, సాగుకు వినియోగించే నీరు ఏ తరహా పథకం కింద అందుతోందదో గుర్తించాలన్నారు. మెట్ట ప్రాంతాల్లోనూ రైతులు సాగుకు ఎన్ని బోర్లు వినియోగిస్తున్నారు? అలాగే కుంటలు, సాన కాలువలు, దొరువులు, బావులు.. ఇలాంటి వాటిలో మోటార్లు, ఇంజిన్లతో సాగు చేస్తున్న పక్షంలో వాటి వివరాలను నమోదు చేయాలన్నారు.

పీడీఎస్‌యూ కమిటీ ఎంపిక

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట పీడీఎస్‌యూ నూతన కమిటీని గురువారం జిల్లా కార్యదర్శి లోకేష్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల పీడీఎస్‌యూ అధ్యక్ష, కార్యదర్శులుగా ఏ.యశ్వంత్, టీ.రాహుల్, సహాయ కార్యదర్శిగా టీ.చైతన్య, ఉపాధ్యక్షులుగా విష్ణు, సుబ్రమణ్యం, కోశాధికారిగా రామ్‌చరణ్‌ను ఎన్నుకున్నారు.